సాక్షి
కాకినాడ

బుధవారం । 7 । ఆగస్టు । 2024




కుర్చీలాట.. కాసులవేట
జిల్లా పరిధిలో ఇటీవల జరిగిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల (సీఐలు) బదిలీపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.



రోడ్డుపై వరినాట్లతో నిరసన
గొర్స–పిఠాపురం రోడ్డులో ముంపునీరు చేరింది. దీంతో ఏ ఒక్క అధికారి పట్టించుకోకపోవడంతో గొర్సకు చెందిన రైతులు రోడ్డుపై వరినాట్లు వేశారు.

8లో

5.18 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 5,18,401 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 8 అడుగులకు నీటి మట్టం చేరింది. తూర్పు డెల్టాకు 3,800, మధ్యడెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

జేఎన్‌టీయూకేలో డైరెక్టర్ల అంతర్గత బదిలీలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడలో పలువురు డైరెక్టర్లను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. యూసీఈకే (యూనివర్సిటీ కాకినాడ ఇంజినీరింగ్ కాలేజీ) సివిల్ ప్రొఫెసర్ కె.రామును ఐఎస్‌టీ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, ఐఎస్‌టీ డైరెక్టర్ గోపాలకృష్ణను రీసెర్చ్ ఇన్నోవేషన్ సెంటర్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, డీఎంసీ స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ చక్రవర్తిని ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్‌గా నియమించారు. మెకానికల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్ కిషోర్‌ను కెమికల్ ఇన్‌చార్జి విభాగాధిపతిగా, మెకానికల్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణభాస్కర్‌ను పెట్రోలియం ఇన్‌చార్జి విభాగాధిపతిగా నియమించారు. ఈ సందర్భంగా వీరిని ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ అభినందించారు.

విచారణ చేపడతాం

సాక్షి ఎఫెక్ట్

కాకినాడ క్రైం: మంగళవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'పోలీసు బదిలీలలు' కథనానికి విశేష స్పందన లభించింది. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఈ మేరకు స్పందిస్తూ అక్రమ బదిలీలపై వాస్తవాలను పరిశీలించి విచారణ చేపడతామన్నారు. వీటిలో ఎస్పీ సీసీ, విశ్రాంత ఏవోల పాత్రపై నిగ్గు తేలుస్తామన్నారు. ఏవో శివరామరాజు పదవీ విరమణ పొందారని, పదవీ విరమణ అనంతరం కార్యాలయ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారన్న సమాచారం పత్రికలో వచ్చిన వార్త ద్వారానే తనకి తెలియవచ్చిందన్నారు. ప్రతిష్టాత్మక జిల్లా పోలీస్ కార్యాలయంలో అక్రమ, అవినీతి కార్యకలాపాలకు పాల్పడే వారిని సహించేది లేదని స్పష్టం చేశారు.

9న జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 9వ తేదిన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. టీవీఎస్,టాటా ఎలక్ట్రానిక్స్, భారత్, ఈ ప్యాక్ వంటి ఆరు ప్రముఖ ప్రైవేట్ సంస్థలు ఆరువేల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని, వయస్సు 18నుంచి 35ఏళ్ల మధ్య ఉండాలన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని, ఇతర వివరాలకు 0884-2373270 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

లెక్చరర్లకు బాబు మార్కు పాఠం

- కాంట్రాక్ట్ అధ్యాపకులను ఉంచుతారా..పీకేస్తారా
- నాలుగు నెలలుగా అందని జీతాలు
- రెన్యువల్‌పై రాని స్పష్టత
- వైఎస్సార్ సీపీ వచ్చి ఉంటే క్రమబద్ధీకరణ పూర్తయ్యేది
- పార్ట్ టైం, గెస్ట్ ఫ్యాకల్టీలదీ అదే పరిస్థితి
- కూటమి ప్రభుత్వంలో అధ్యాపకులకు మొండిచేయి
- ఉమ్మడి తూర్పులో 396 మంది ఎదురుతెన్నులు



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకురాలు



ఎన్నికల సమయంలో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేస్తానని సభలో చెబుతున్న చంద్రబాబు



ఎన్నికల సమయంలో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేస్తాం. ఉద్యోగులందరికీ ఠంచన్‌గా ఒకటో తేదీనే జీతాలు అందజేస్తాం. కూటమి ప్రభుత్వానికి మీరంతా అండగా నిలబడండి'. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను చంద్రబాబు ఇటువంటి ఆర్భాటపు ప్రచారంతో ఊరూ వాడా ఊదరగొట్టారు. బాబు మాటలను నమ్మి ప్రజలు ఓటేశారు. గద్దెనెక్కి రెండు నెలలు దాటిపోయినా కాంట్రాక్ట్ లెక్చరర్ల ఇబ్బందులు పట్టించుకోలేదు. వారు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు నీరుగారిపోయాయి. కాంట్రాక్ట్ పొడిగింపు ఉత్తర్వులు ఇవ్వకపోగా నెలనెలా క్రమం తప్పకుండా ఇస్తామన్న జీతాలు కూడా ఇవ్వకుండా తమ కుటుంబాలను నిలువునా దగా చేశారని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రమబద్ధీకరణ మాట దేవుడెరుగు కనీసం సర్వీసు పొడిగింపు ప్రక్రియను కూడా గాలికొదిలేశారని చంద్రబాబుపై అధ్యాపకులు మండిపడుతున్నారు. చంద్రబాబును నమ్మి మరోసారి మోసపోయామంటూ అధ్యాపకులు కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు. సర్వీసు క్రమబద్ధీకరణ లేకపోగా ఎన్నికల పుణ్యమా అంటూ నిలిచిపోయిన రెండు నెలలు, చంద్రబాబు గద్దెనెక్కాక రెండు నెలలు కలిపి నాలుగు నెలలుగా వేతనాలు లేక అప్పులతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని అధ్యాపకులు కంటతడి పెడుతున్నారు. ఎక్కడైనా ఎవరైనా పచారీ సామాన్లు, ఇంటి అద్దెలు, కేబుల్ బిల్లులు చెల్లించడానికి జీతం రాలేదంటే ఒక నెల అంగీకరిస్తారు. నమ్మకం ఉంటే రెండో నెల ఇస్తారు. కానీ నాలుగు నెలలు అప్పులంటే ఎవరు మాత్రం ఇస్తారని అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. విభజిత రాష్ట్రంలో ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా ఎక్కడా కనిపించకుండా ప్రతి ఉద్యోగికి వేతనం ఒకటో తేదీ నాడే ఠంచన్‌గా చెల్లిస్తామన్న చంద్రబాబు మాట నీటిమూటగా మిగిలిపోయిందని అధ్యాపకులు కన్నెర్ర చేస్తున్నారు. నమ్మలేం నమ్మలేం అనుకుంటూనే చంద్రబాబు మాటలు నమ్మి మరోసారి మోసపోయామని కాంట్రాక్ట్ లెక్చరర్‌లు గగ్గోలు పెడుతున్నారు. గతంలో ఇవే డిమాండ్‌లపై రాజమహేంద్రవరంలో ఆందోళన చేస్తున్న సమయంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు తమ శిబిరం వద్దకు వచ్చి మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు తమ గోడు పట్టించుకోవడం లేదంటున్నారు.

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేసే లెక్చరర్‌లు, గెస్ట్ ఫ్యాకల్టీలకు జీతాలు నిలిచిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతటా కాంట్రాక్ట్ లెక్చరర్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,618 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా కాంట్రాక్ట్ లెక్చరర్‌లు 241, గెస్ట్ ఫ్యాకల్టీలు 47 మంది విధులు నిర్వహిస్తున్నారు.

జీవో నంబర్ 114తో నాడు అధ్యాపకుల ఆనందం

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గతేడాది అక్టోబర్ 22న జీవో నంబర్ 114 ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ ప్రకటనతో ఎన్నో ఏళ్లుగా క్రమబద్ధీకరణ కోసం వేయికళ్లతో ఎదురుచూస్తోన్న కాంట్రాక్ట్ అధ్యాపకులు తమ బతుకులు మారుతాయని చాలా సంతోషపడ్డారు. పరిపాలనా ప్రక్రియ పూర్తి అయ్యేసరికి సార్వత్రిక ఎన్నికలు వచ్చేశాయి. ఈ విషయమై నాటి సీఎం జగన్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకోగా సానుకూలంగా స్పందించి ప్రభుత్వం రాగానే క్రమబద్ధీకరణకు చట్టబద్ధత తీసుకువస్తామని చెప్పారు. ఎన్నికలు ముగిశాయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 41 జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 288 మంది ఆశలు ఆవిరైపోయాయి. చంద్రబాబు సర్కార్ అధ్యాపకుల కాంట్రాక్ట్ పొడిగింపునకు ఉత్తర్వులు ఇవ్వ లేదు. గత మే నెల నుంచి జీతాలు కూడా ఇవ్వక పోవడంతో అధ్యాపకులు కన్నీరు పెట్టుకుంటున్నారు. కాంట్రాక్టు లెక్చరర్ల ఒప్పంద గడువును కొత్త విద్యా సంవత్సరానికి పునరుద్ధరించాల్సి ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం వారి పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తోంది.

పీఆర్సీ వర్తింపజేసిన జగన్ సర్కారు

గతంలో అధ్యాపకుల వేతనాలు నామమాత్రంగా ఉండి ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ అధ్యాపకులు ఎదుర్కొంటోన్న ఇబ్బందులను గుర్తించి పీఆర్సీ వర్తింపజేయడం రాష్ట్ర చరిత్రలో సాహసోపేతమైన నిర్ణయంగా భావించారు. అప్పటి వరకు రూ.37,100 ఉన్న వీరి జీతాలు ఒకేసారి రూ.20,000 పెరగడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అంటే కాంట్రాక్ట్ అధ్యాపకుని వేతనం ఒకేసారి రూ.57,100 అయ్యింది. 2000లో చేరిన కాంట్రాక్ట్ అధ్యాపకులకు రెండు పుష్కరాల కాలం తరువాత జగన్ ప్రభుత్వంలో వెలకట్ట లేని మేలు జరిగింది. 2019 ముందు కాంట్రాక్ట్ అధ్యాపకులకు విద్యాసంవత్సరంలో 6 నుంచి 9 నెలలు మాత్రమే కాంట్రాక్ట్ కాలపరిమితి ఉండేది. ఏడాదంతా పనిచేసినా జీతాలు మాత్రం ఆరు నుంచి తొమ్మిది నెలలకే సరిపెట్టేసే దుస్థితి. అలా వారి కష్టాన్ని ప్రభుత్వాలు దోచుకున్నాయి. విద్యా సంవత్సరం ముగిసిన అనంతరం కూడా కాంట్రాక్ట్ అధ్యాపకులతో పనులు చేయించుకునే వారు. కానీ జీతాలు మాత్రం ఎగ్గొట్టే వారు. ఈ నేపథ్యంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనా కాలంలో అధ్యాపకులకు విద్యా సంవత్సరానికే పరిమితం కాకుండా 12 నెలల కాలానికి కాంట్రాక్ట్ వర్తించేలా ఆదేశాలు ఇచ్చారు. 2019 నుంచి ఏటా క్రమం తప్పకుండా జూన్ ఒకటో తేదీ లోపే అధ్యాపకుల కాంట్రాక్ట్‌ను పునరుద్ధరిస్తూ వచ్చారు. జగన్ నిర్ణయం అంత వరకూ జీతాలందక ఇబ్బందులు ఎదుర్కొంటోన్న అధ్యాపకుల నెత్తిన పాలుపోసినట్టయ్యింది.

బాబు రాగానే కష్టాలు మొదలు

మళ్లీ చంద్రబాబు గద్దె నెక్కారో లేదో అధ్యాపకుల క్రమబద్ధీకరణ సందిగ్ధంలో పడింది. జీతాలు కూడా నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలవుతున్నా నాలుగు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంవత్సరం ముగిసిన తర్వాత కూడా ఖాళీగా లేకుండా విధులు నిర్వహించామంటున్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. అనంతరం సప్లమెంటరీ పరీక్షల విధులు, ఆన్‌లైన్ మూల్యాంకనం, వీటితో పాటు 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాలను కూడా కాంట్రాక్ట్ అధ్యాపకులే నిర్వహించారు. అయినా మే నెల నుంచి ఇప్పటి వరకూ జీతాలు ఇవ్వకుండా తమ కుటుంబాలను రోడ్డున పడేశారని మండిపడుతున్నారు. వీరికి కాంట్రాక్టులు పునరుద్ధరిస్తే తప్ప పెండింగ్ జీతాలు విడుదలయ్యే అవకాశం కనిపించడం లేదు. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి ఉంటే ఈ పాటికి క్రమబద్ధీకరణ, పెండింగ్ వేతనాలు విడుదల అయ్యేవని అధ్యాపకులు అంటున్నారు. కూటమి ప్రభుత్వాన్ని నమ్మి ఓటేసిన పాపానికి ఇప్పుడు అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు బోధనలో కాంట్రాక్ట్ లెక్చరర్‌లదే కీలక పాత్ర. విద్యార్థులకు ఇంటర్ విద్య ఎంతో కీలకమైనది. సైన్స్, ఆర్ట్స్ సబ్జెక్టులు బోధించే లెక్చరర్‌లలో మెజార్టీ కాంట్రాక్టు అధ్యాపకులే కావడం గమనార్హం. కూటమి ప్రభుత్వంలో తమ కాంట్రాక్టును పునరుద్ధరిస్తారా లేదా అనే ఆందోళనలో అధ్యాపకులు ఉన్నారు.

జీతాలు వెంటనే విడుదల చేయాలి



ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగులందరికి జీతాలు వెంటనే విడుదల చేయాలి. అలాగే కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలి. గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ఇచ్చినా ఎన్నికల కోడ్ కారణంగా జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, కాలేజీల్లో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులకు ఉత్తర్వులు విడుదల చేయడానికి వీలు కాలేదు. ఆగిపోయిన మా రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేసి వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

– డాక్టర్ వాలుపు కనకరాజు, జోనల్ కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలి



వైఎస్ జగన్ ప్రభుత్వం 2023 అక్టోబర్ 23న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేస్తూ 114వ జీవోను విడుదల చేసింది. ఈ లోగా ఎన్నికల కోడ్ వల్ల జీవో అమలు కాలేదు. కొత్త ప్రభుత్వం జీవోను అమలు చేసి కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులైజేషన్ చేయాలి. 2000లో చేరిన మేమంతా ఏడేళ్లలో రిటైరైపోతాం. రెగ్యులైజేషన్ చేసి భరోసా కల్పించాలి.

– ఆర్.కిరణ్‌కుమార్, కాంట్రాక్టు అధ్యాపకుడు, నిడదవోలు

కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ చేపట్టాలి



గత ప్రభుత్వంలో జూన్ నెలలోనే క్రమబద్ధీకరణ చేసేవారు. ఇప్పటికి కూడా చేయకపోవడంతో మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారి ఈఎంఐలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరణ చేయాలి.

– చిక్కాల నరసింహం, ఏపీ కాంట్రాక్టు లెక్చరర్ల అసోషియేషన్ కార్యదర్శి, కొత్తపేట, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

రత్నగిరిపై ఆధ్యాత్మిక సౌరభం



సత్యదేవుడు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

- ఘనంగా సత్యదేవుని ఆవిర్భావ దినోత్సవం
- స్వామివారి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం
- వజ్ర కిరీటాలంకరణలో స్వామి, అమ్మవార్ల దర్శనం
- ఘనంగా ఆయుష్య హోమం, పూర్ణాహుతి
- వేద పండితులు, విశ్రాంత వైదిక సిబ్బందికి సత్కారం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సత్యదేవుని 134వ ఆవిర్భావ దినోత్సవం (జయంత్యుత్సవం) సందర్భంగా రత్నగిరిపై మంగళవారం ఆధ్యాత్మిక సౌరభం వెల్లి విరిసింది. వివిధ వైదిక, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ప్రత్యేక శోభను సంతరించుకుంది. సత్యదేవుని జన్మ నక్షత్రం 'మఖ' కూడా మంగళవారం రావడంతో సత్యదేవునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు స్వామివారి ఆయుష్య హోమం, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది వేడుకల్లో ప్రధానంగా స్వామివారి దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి దాత, శ్రీలలితా రైస్ ఇండస్ట్రీ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్, కమల దంపతులు రూ.1.5 కోట్ల వ్యయంతో తయారు చేయించిన వజ్ర కిరీటం, స్వామి, అమ్మవార్లకు వజ్ర కర్ణా భరణాలు అలంకరించడంతో ప్రత్యేక శోభతో స్వామి, అమ్మవారు ప్రకాశించారు.

ఘనంగా జన్మ నక్షత్ర పూజలు, అభిషేకం

రత్నగిరివాసుడు సత్యదేవుని 134వ ఆవిర్భావ దినోత్సవం శ్రావణశుద్ధ విదియ సందర్భంగా మంగళవారం రత్నగిరిపై ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున రెండు గంటలకు సత్యదేవుని ఆలయం తెరచి పూజలు నిర్వహించారు.మూడు గంటల నుంచి ఉదయం ఐదు గంటల వరకూ ప్రధానాలయంలోని సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుని మూలవిరాట్లకు పంచామృతాలతో పండితులు అభిషేకం నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో, స్వామి, అమ్మవార్లను వజ్ర కిరీటాలు, వజ్ర కర్ణాభరణాలతో, సుగంధ భరిత పుష్పాలతో అలంకరించి పూజించారు. అనంతరం ఉదయం 7–30 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, స్వామి, అమ్మవార్లకు వజ్ర కిరీటాలు, వజ్ర కర్ణాభరణాలు చేయించిన దాత మట్టే సత్యప్రసాద్ దంపతులు, బంధుమిత్రులతో కలిసి అభిషేకంలో పాల్గొన్నారు.

17 మంది పండితులకు సత్కారం

సత్యదేవుని జయంత్యుత్సవాలలో భాగంగా 17 మంది పండితులను ఘనంగా సత్కరించారు. సత్కారం పొందిన వారిలో వేద పండితులు విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, కడియాల సీతారామ ఘనాపాఠి, గుళ్లపల్లి వేంకట నాగ శ్రీరామ అవధాని, శ్రీపాద వేంకట్రామ సుబ్రహ్మణ్యం, దెందులూరి రామేశ్వర శర్మ, కోట రాంబాబు శర్మ ఉన్నారు. దేవస్థానం విశ్రాంత వేదపండితులు ముష్టి కామశాస్త్రి, చింతా చలపతి అవధాని, విశ్రాంత ప్రధానార్చకులు ఇంద్రగంటి గోపాలకృష్ణ శాస్త్రి, నాగాభట్ల సత్యనారాయణ, విశ్రాంత అర్చకులు గాడేపల్లి సత్యనారాయణ, శేషగిరి, దేవస్థానం వైదిక సలహాదారు నాగాభట్ల కామేశ్వరశర్మ, విశ్రాంతి కల్యాణబ్రహ్మ ముత్య సత్యనారాయణ, పురోహితులు పాలంకి సత్యనారాయణ, మొక్కరాల వేంకట్రావు, ఛామర్తి సత్యనారాయణలను ఈఓ దుశ్శాలువా, నగదు పారితోషికం, స్వామివారి ప్రసాదం ఇచ్చి ఘనంగా సత్కరించారు.

పల్లకీపై ఘనంగా సత్యదేవుని ఊరేగింపు

వర్షం కారణంగా ఆలయ ప్రాంగణంలో రథోత్సవం నిర్వహించడానికి అవకాశం లేకపోవడంతో సత్యదేవుడు, అమ్మవారిని పల్లకీలో ఆలయం లోపల ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు. కార్యక్రమం అనంతరం స్వామి, అమ్మవార్లకు నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను దేవస్థానం వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠి, గంగాధరబట్ల గంగబాబు, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, దత్తుశర్మ, సుధీర్, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, పురోహితులు నాగాభట్ల రవిశర్మ, పాలంకి పట్టాభి, అంగర సతీష్ నిర్వహించారు. సత్యదేవుని ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సత్యదేవుని ఆలయ ప్రాంగణాన్ని రంగు రంగుల పుష్పమాలలతో సుందరంగా అలంకరించారు. స్వామివారి ఆలయానికి విచ్చేసిన భక్తులు ఈ అలంకరణల వద్ద ఫొటోలు దిగారు.

వజ్ర కిరీటానికి ప్రత్యేక పూజలు

స్వామి, అమ్మవార్ల అభిషేకాలకు ముందు అమ్మవారి వజ్ర కిరీటానికి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. మహన్యాసంలో కూడా కిరీటాన్ని ఉంచి దాత మట్టే సత్యప్రసాద్ దంపతులతో పూజలు చేయించారు. కార్యక్రమాల అనంతరం దాత దంపతులకు వేద పండితులు ఆశీస్సులు అందచేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు. అనివేటి మంటపంలో ఉదయం 11 గంటలకు ఆయుష్యహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం సత్యదేవుడు, అమ్మవారికి పండితులు నీరాజనం, మంత్రపుష్పం సమర్పించారు. కాయం ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్, డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమ్మవారి వజ్ర కిరీటం, కర్ణాభరణాల బరువు 739.555 గ్రాములు

వజ్ర కిరీటం, కర్ణాభరణాల తయారీలో 720.479 గ్రాముల బంగారం, 85 క్యారట్స్ బరువు కలిగిన 5,861 వజ్రాలు, 10.38 క్యారెట్స్ బరువు కలిగిన పచ్చలు, కెంపులు వాడారు. సత్యదేవుని వజ్ర కిరీటంలో 656 గ్రాముల బంగారం, 114.41 క్యారెట్స్ బరువు కలిగిన 3,764 వజ్రాలు, 14.97 క్యారెట్స్ బరువు గల కెంపులు, పచ్చలు ఉపయోగించినట్టు దాత తెలిపారు.



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల వద్ద అమ్మవారి వజ్ర కిరీటం, కర్ణాభరణాలు ఉంచి పూజలు చేస్తున్న దృశ్యం



వజ్ర కిరీటం దాత మట్టే సత్యప్రసాద్ దంపతులకు వేదాశీస్సులు అందజేస్తున్న పండితులు

అన్నవరంలో 'డోనార్ ప్రివిలేజ్' కార్డులు

- కార్డు స్కాన్ చేస్తే దాత విరాళాల వివరాలు వెల్లడి
- వాట్సాప్ చాట్ ద్వారా సమాచారం తెలిపే సదుపాయం
- దేవస్థానం ఫోన్ యాప్ ఆవిష్కరణ



డోనార్ ప్రివిలేజ్ కార్డును దాత చక్కా తాతబాబుకు అందచేస్తున్న ఈఓ రామచంద్రమోహన్

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వివిధ పథకాలకు, అన్నదాన ట్రస్ట్‌కు విరాళాలిచ్చిన దాతలకు 'డోనార్ ప్రివిలేజ్' కార్డులను పంపిణీ చేసే కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. సత్యదేవుని 134వ జయంత్యుత్సవం సందర్భంగా తొలి కార్డును దేవస్థానంలో పలు పథకాలకు విరాళాలిచ్చిన తుని పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త, దాత చక్కా సూర్యనారాయణ (తాతబాబు) కు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఏటీఎం కార్డును పోలి ఉండే ఈ కార్డును స్కాన్ చేయగానే దాత వివరాలు అన్నీ ఫోన్ లేదా కంప్యూటర్‌లో డిస్‌ప్లే అవుతాయన్నారు. ఈ కార్డు ద్వారా దేవస్థానంలో వారి విరాళాలననుసరించి దాతలు తగు సదుపాయాలు పొందవచ్చునని ఈఓ వివరించారు. రూ.లక్ష నుంచి రూ.పది లక్షల వరకు విరాళాలిచ్చిన దాతలకు సిల్వర్ కార్డు, రూ.పది లక్షలుకు మించి విరాళాలిచ్చిన దాతలకు గోల్డెన్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా దేవస్థానం సమాచారం

దేవస్థానానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని 'వాట్సాప్ చాట్‌బాట్ ' ద్వారా తెలుసుకునే సదుపాయం కూడా మంగళవారం నుంచి అమలులోకి తెచ్చారు. దీని ప్రకారం దేవస్థానం వాట్సాప్ నంబర్ 91+94912 49990 కు వాట్సాప్ కాల్ చేసి ఏ సమాచారం అడిగినా వెంటనే రిప్లై వస్తుందని తెలిపారు. ఈ వాట్సాప్ చాట్‌బాట్ ఫ్లెక్సీ మీద గల క్యూఆర్ కోడ్‌ను ఫోన్ స్కాన్ చేసి కూడా ఈ సదుపాయం పొందవచ్చునని తెలిపారు.

దేవస్థానం ఫోన్ యాప్ ఆవిష్కరణ

అన్నవరం దేవస్థానానికి సంబంధించిన అన్ని వివరాలతో కూడిన యాప్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని దేవస్థానానికి సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ యాప్ ద్వారా దేవస్థానం వెబ్‌సైట్‌కు కనెక్ట్ అయి వసతి గదుల రిజర్వేషన్, దర్శనం టిక్కెట్లు, వ్రతాల టిక్కెట్లు పొందడమే కాక విరాళాల సమర్పణ చేసే అవకాశం కల్పిస్తున్నట్లు ఈఓ తెలిపారు. వీటిని 'అమరావతి ఇన్నోవేషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ ' రూపొందించిందని తెలిపారు.

రైల్వేలైన్ భూములపై న్యాయం చేయండి



తొత్తరమూడిలో రైల్వేలైన్ స్థలాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ

అయినవిల్లి: కోటిపల్లి – నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణం కోసం సేకరించిన భూములకు పూర్తిగా నష్టపరిహారం అందజేయాలని రైతులు కోరారు. కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ మంగళవారం ఆయా భూములను పరిశీలించారు. శానపల్లి లంక, తొత్తరమూడి కొడవటివారిలంకలోని రైల్వే లైన్‌కు సంబంధించిన స్థలాలు ఎవరి స్వాధీనంలో ఉన్నాయనే విషయంపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ విషయంపై ఇన్‌చార్జి తహసీల్దార్‌ను ఆరా తీశారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న పలువురు రైతులు ఆర్డీఓతో మాట్లాడుతూ రైల్వే లైన్ నిర్మాణం కోసం సేకరించిన స్థలాలు 2003 నుంచి తమ స్వాధీనంలోనే ఉన్నాయన్నారు. వాటి విషయంలో తమకు పూర్తిగా అన్యాయం జరిగిందని, అప్పటి అధికారులు స్థలం కోసం ప్రభుత్వం రేటు ప్రకారం పార్టు పేమెంట్‌గా ఎకరానికి రూ.1.22 లక్షలు చెల్లించారన్నారు. కానీ ఆ భూమిలోని కొబ్బరి, మామిడి, చింత, టేకు, ఫలవృక్షాలకు ఏవిధమైన నష్టపరిహారం చెల్లించలేదన్నారు. కానీ కొందరు రైతులకు మాత్రం ఎకరాకు రూ.3.13 లక్షల వరకూ పరిహారం చెల్లించి తమపై పక్షపాతం చూపించారని ఆరోపించారు. తమకు ఎకరాకు రూ.10 లక్షల చొప్పున చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆర్డీఓ వెంట తొత్తరమూడి సర్పంచ్ వార జయసావిత్రి, నేదునూరి వీర్రాజు, వార లక్ష్మీనరసింహరామ్ ఉన్నారు. అనంతరం ఈ విషయంపై ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్షించారు.

క్లుప్తంగా

పాఠశాలల మూసివేత నిర్ణయం తగదు


అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం సర్దుబాటులో పేరుతో ప్రాథమిక పాఠశాలల మూసివేతకు నిర్ణయం తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్య పల్లంరాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం అమలాపురంలో ప్రకటన విడుదల చేశారు. 2024 జనవరి నుంచి జూలై వరకూ వందల మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేసిన క్రమంలో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. దీన్ని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ విధానాలతో చర్యలు చేపట్టాల్సింది పోయి, ఇప్పుడు సర్దుబాటు పేరుతో ప్రాథమిక పాఠశాలలను మూసివేయడం అన్యాయమన్నారు. అలాంటి ప్రాథమిక పాఠశాలలను గుర్తించి ఉన్నత పాఠశాలల్లో డిప్యూటేషన్ చేయాలన్న ఆలోచన తగదన్నారు. దీని ప్రకారం పది మంది వరకూ విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలు జిల్లాలో 300కి పైగా ఉన్నాయన్నారు. ఇలాంటి వాటిని మూసివేయడం శాస్త్రీయ విధానం కాదని స్పష్టం చేశారు.

డిఫెన్స్ కౌన్సిల్ స్థానాల భర్తీకి దరఖాస్తులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయంలోని లీగల్ సెల్ ఎయిడ్ డిఫెన్స్ స్థానాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. రెండు డిప్యూటీ, ఐదు అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ స్థానాలను భర్తీ చేస్తామన్నారు. వీటికి సంబంధించిన దరఖాస్తులను జిల్లా న్యాయస్థాన అధికారిక వెబ్‌సైట్ లోనూ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నోటీసుబోర్డులోనూ అందుబాటులో ఉంచామన్నారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కు సంబంధించి క్రిమినల్‌లా లో ఏడేళ్ల అనుభవం, సెషన్స్ కోర్టులో కనీసం 20 క్రిమినల్ ట్రైల్స్ చేయడంతో పాటు మంచి సంభాషణ, లేఖనా నైపుణ్యాలు ఉన్న న్యాయవాదులు అర్హులన్నారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కు క్రిమినల్ లాలో మూడేళ్ల అనుభవంతో పాటు మంచి సంభాషణ, లేఖనా నైపుణ్యాలు ఉండాలన్నారు. ఆసక్తి కలవారు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు ఈస్ట్‌గోదావరి.డికోర్ట్స్.గవ్.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

కుర్చీలాట.. కాసుల వేట

- వివాదాస్పదంగా సీఐల బదిలీలు
- ఆ ఐదుగురికీ నేతల అండలు
- భారీగా చేతులు మారిన డబ్బు





కాకినాడ క్రైం: జిల్లా పరిధిలో ఇటీవల జరిగిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల (సీఐలు) బదిలీపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలంగా ఉన్నవారికి, డబ్బులు ముట్టజెప్పిన వారికే నాయకులు వత్తాసు పలికారని, అధికారులు కూడా నాయకుల అడుగులకు మడుగులొత్తుతూ కోరినంత ముట్టజెప్పారనే ఆరోపణలు వచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ప్రభుత్వ ప్రతినిధులైన పెద్దలు ఈ బదిలీల మాటున కుర్చీలాట ఆడుకున్నారు. ఒక్కో సీఐ పోస్టుకు రూ.లక్షలు డిమాండ్ చేశారు. ఉత్తర్వుల్లేకుండానే సీట్లను అమ్మేశారు. ఆయా స్థానాలలోని పాత అధికారులను వీఆర్‌కు పంపి, తమకు అనుకూలమైన వారిని నియమించుకున్నారు.

కోరుకున్నచోట పోస్టింగ్

కోరుకున్నచోట పోస్టులు సంపాదించడానికి కొందరు అధికారులు రూ.అరకోటి వరకు వెచ్చిస్తే, తమ వారిని తెచ్చుకోవడానికి కూటమి నాయకులు నిబంధనలు తుంగలో తొక్కారు. కొన్ని సర్కిళ్ల పరిధిలో అయితే అధికారుల మధ్యే గుట్టు చప్పుడు కాకుండా హాట్ సీట్లకు అంతర్యుద్ధమే జరిగింది. ఈ యుద్ధంలో డబ్బు వెదజల్లిన వారినే పోస్టింగ్ వరించింది. జిల్లా పోలీస్ శాఖలో అందరి కంటే ముందుగా ఐదుగురు ఇన్‌స్పెక్టర్లకు బదిలీ అయ్యింది. ఇన్ని ఎస్‌హెచ్‌వోలు, సర్కిళ్లు, ఇంతమంది సీఐలు ఉండగా వీరికే ఆ ప్రాధాన్యత ఏమిటోనన్న చర్చ పోలీస్ వర్గాల్లో విస్తృతంగా జరుగుతోంది. ఈ ఐదు సీట్లు కలెక్షన్ల పరంగా కీలకమైన స్థానాలే కావడం గమనార్హం.

పాత ఐదుగురూ వీఆర్‌లోకి..

వివాదాస్పద కొత్త సీఐల స్థానాల్లో అంతకుముందు పనిచేసిన అధికారులు ఐదుగురికీ పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఏలూరు రేంజ్‌లో వీఆర్‌లోకి పంపడం గమనార్హం. సామర్లకోట సీఐగా పనిచేసిన డి.సురేష్‌ను వీఆర్‌కు పంపి ఆయన స్థానంలో ఆర్.అంకబాబును నియమించారు. కాకినాడ రూరల్ సీఐగా పనిచేసిన కె.శ్రీనివాస్‌ను వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో డీఎస్ చైతన్యకృష్ణ నియమితులయ్యారు. తుని రూరల్‌లో పనిచేసిన ఎస్‌వీవీఎస్ మూర్తిని వీఆర్‌కు పంపి ఆయన స్థానంలో జి.చెన్న కేశవరావును నియమించారు. పెదాపురం ఇన్‌స్పెక్టర్ వై.రవికుమార్‌ను వీఆర్‌కు పంపి టి.క్రాంతికుమార్‌తో ఆ పోస్టును భర్తీ చేశారు. అలాగే సర్పవరం పీఎస్ సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌కు కూడా పోస్టింగ్ లేదు. వీఆర్‌కే పంపారు. ఆయన స్థానంలో బొక్కా పెద్దిరాజును నియమించారు.

ఆదేశాలు లేకుండానే జాయినింగ్

పోలీస్ శాఖలో ఓ హోంగార్డు పోస్టుకు కూడా ముందస్తు ఉత్తర్వులు, ఎస్పీ అనుమతులే ప్రాతిపదిక. ఆ ఉద్యోగికి ముందుగా ఉత్తర్వులు అందిన తర్వాతే ఏ స్థాయి వారైనా బాధ్యతలు స్వీకరిస్తారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల విషయంలో మాత్రం ఆ ఊసే లేకపోవడం గమనార్హం. జిల్లాలో వివాదాస్పదమవుతున్న ఐదుగురు సీఐల బదిలీలలో ఏ ఒక్కరికీ చేరే సమయానికి ఉత్తర్వులు అందలేదు. మీరు కోరుకున్న చోట పోస్టింగ్ ఇస్తున్నామని ఈ నెల ఒకటో తేదీ రాత్రి ఫోన్ కాల్ రావడంతో వారంతా బాధ్యతల్లో చేరిపోయారు. ఈ నెల 2వ తేదీన ఉదయం వీరు చేరితే, మధ్యాహ్నం వరకూ ఉత్తర్వులు వెలువడలేదు.

గంజాయి కేసులో ఏ7 సామర్లకోట సీఐ

సామర్లకోట సీఐగా నియమితులైన ఆర్.అంకబాబు.. 2016లో చింతూరు పీఎస్‌లో సీఐగా పనిచేశారు. గంజాయి అక్రమార్కులతో చేతులు కలిపి లారీలను బోర్డర్ దాటించారు. పట్టుబడే సమయానికే ఈయన స్వయానా 30 వరకు లారీలు తరలించినట్లు అంచనాకు వచ్చారు. అతనిపై అప్పటి చింతూరు అదనపు ఎస్పీ ఫకీరప్ప కేసు నమోదు చేశారు. ఆ కేసులో అంకబాబును ఏ7 నిందితుడిగా చేర్చారు. 65 భారీ బస్తాలలో రూ.63.75 లక్షల విలువైన 2,125.30 కిలోల గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అప్పటికే అక్రమ రవాణాకి పచ్చ జెండా ఊపేసిన అంకబాబు కొన్ని రూ.కోట్ల మొత్తాన్ని వెనకేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేరంలో పట్టుబడిన రోజు పోలీసులకు చిక్కకుండా పరారై.. మూడేళ్ల అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సుదీర్ఘ విరామం తర్వాత న్యాయస్థానంలో ఎన్నోమార్లు తిరస్కరణకు గురై చివరికి యాంటిసిపేటరీ బెయిల్ తెచ్చుకుని బయటకు వచ్చారు. ఆ తర్వాత కృష్ణా జిల్లాకు వెళ్లిపోయి, కాకినాడకు వచ్చేందుకు విఫల ప్రయత్నం చేశాడు. ఎన్నికల ముందు సామర్లకోట క్రైం సీఐగా బదిలీ పొందారు. అనంతరం అక్కడే కంటిన్యూ అయ్యారు.

ఆరు స్టేషన్ల హాట్ సీట్

కాకినాడ రూరల్ సర్కిల్ ఆరు స్టేషన్ల సముదాయం. రాష్ట్రంలో ఇన్ని స్టేషన్ల పరిధి ఉన్న సర్కిల్ అత్యంత అరుదు. తిమ్మాపురం, ఇంద్రపాలెం, పెదపూడి, కరప, గొల్లపాలెం, కోరంగి ఇలా ఆరు పీఎస్‌లు ఈ సర్కిల్ పరిధిలోకి వస్తాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ సర్కిల్ ఎప్పటికీ డిమాండ్ ఉండే హాట్‌సీటే. కాకినాడ రూరల్ సీటు పొందేందుకు కనీసం రూ.50 లక్షలు వెచ్చించాల్సిన పరిస్థితి ఉంది. స్టేషన్లన్నింటిలో ఈ స్టేషన్ ధరే ఎక్కువగా పలికింది. ఇక్కడకు డీఎస్ చైతన్యకృష్ణ బదిలీపై వచ్చారు. ఈయన సర్వీసులో సింహభాగం కాకినాడ పరిధే. కాకినాడను వదిలెల్లిన దాఖలాలు అత్యంత అరుదు. రాజోలు, తణుకు లాంటి చోట్ల చేసినా ఎక్కువ కాలం లేరు. చైతన్యకృష్ణ కాకినాడ సర్కిల్‌లో ఇంటెలిజెన్స్, టూటౌన్, త్రీటౌన్, సర్పవరం, కాకినాడ ట్రాఫిక్-2లో పనిచేశారు.

సర్పవరానికి పెద్దిరాజు

సర్పవరం సీఐగా బొక్కా పెద్దిరాజు నియమితులయ్యారు. ఈయన కోనసీమలో ఎక్కువ సంవత్సరాలు పనిచేశారు. సర్పవరం సీఐ సీటు ధర రూ.40 లక్షలకు పైగా పలికిందనే ప్రచారం ఉంది. యూనియన్లు, ఫ్యాక్టరీలు, ఆయిల్ కంపెనీలు, షిప్పింగ్ కంపెనీలు, ఖరీదైన షాపింగ్ మాళ్లు, ఇతర వ్యాపార సంస్థలతో పాటు కాకినాడ సిటీలో కొంత పరిధి ఈ స్టేషన్ కిందకు వస్తుంది.

యనమల ప్రియశిష్యుడు

తుని రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన జి.చెన్నకేశవరావు యనమల రామకృష్ణుడి ప్రియశిష్యుడిగా పేరుపొందారు. 1995లో ఎస్సైగా గొల్లప్రోలులో తొలి పోస్టింగ్ పొందిన ఈయన ఇన్నేళ్లలో ఆ ఒక్క స్థానం తప్ప మిగిలిన సర్వీస్ అంతా తుని నియోజకవర్గంలో కొనసాగించారు. దేశంలోనే సంచలనానికి తెరతీసిన కాపు ఉద్యమం ఈయన హయాంలోనే జరిగింది. అప్పటి మంత్రి యనమల రామకృష్ణుడు ఎవరి పేరు చెబితే వారిపై అక్రమ కేసులు బనాయించి తీసుకొచ్చి లోపల పడేసిన సందర్భాలు అనేకం ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి. కాపు నేతలపై అత్యధిక కేసులు నమోదు చేసిన ఘనత ఈయనదే. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత మెరైన్ సీఐగా వెళ్లిపోయారు. మళ్లీ తాజా ప్రభుత్వంలో తుని రూరల్‌కు వచ్చారు.

క్రాంతికుమార్‌పై అనేక ఆరోపణలు

ఎమ్మెల్యే చినరాజప్ప ఆశీస్సులతో పెద్దాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టి.క్రాంతికుమార్ వచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏలూరు జిల్లా జీలుగుమిల్లి సర్కిల్‌కి బదిలీ అయిన ఈయన అంతకుముందు పెదపూడి పీఎస్, కాకినాడ సీసీఎస్‌లో పనిచేశారు. తాజాగా పెద్దాపురానికి బదిలీపై వచ్చారు. క్రైం సీఐగా కొనసాగుతున్నప్పుడు ప్రాపర్టీ రికవరీ విషయాల్లో ఈయనపై పలు ఆరోపణలు ఉన్నాయి. రికవరీ విషయాలు పోలీస్ వర్గాలకు కూడా తెలియకుండా దాచిపెట్టి తన సొంత కోటరీని పెట్టుకొని నడిపేవాడనే చెప్తారు. పెదపూడి, అమలాపురం పోలీస్ స్టేషన్లలో పనిచేసేటప్పుడు కొన్ని ఆరోపణలు ఉన్నాయి.

మద్యం మత్తులో ఘర్షణ

అమలాపురం టౌన్: అమలాపురం సావరంలో మద్యం మత్తులో ముగ్గురు స్నేహితులు ఘర్షణ పడ్డారు. అల్లవరం మండలం తుమ్మలపల్లికి చెందిన యాలంగి కృష్ణబాబు, అమలాపురం రూరల్ మండలం కామనగరువు శివారు అబ్బిరెడ్డి కాలనీకి చెందిన నాగవరపు సుధీర్, స్థానిక ముమ్మిడివరం గేట్ సెంటరుకు చెందిన కొమ్మోజు ప్రసాద్ మంగళవారం సాయంత్రం మద్యం తాగి ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో వీరందరూ గాయాల పాలు కావడంతో వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్ తెలిపారు.

రోడ్డుపై వరినాట్లతో నిరసన



గోర్స-పిఠాపురం రోడ్డులో నాట్లు వేస్తున్న రైతులు

కొత్తపల్లి: గోర్స-పిఠాపురం రోడ్డులో ముంపునీరు చేరింది. దీంతో ఏ ఒక్క అధికారి పట్టించుకోకపోవడంతో గోర్సకు చెందిన రైతులు రోడ్డుపై వరి నాట్లు వేశారు. వారం రోజులుగా రోడ్డుపైనే నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ముంపునీరు పోయేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యవసాయ పథకాలకు ఈ-క్రాప్ ప్రామాణికం



గూడాలలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అల్లవరం: ప్రతి రైతు తాను పండిస్తున్న పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. అల్లవరం మండలం గూడాలలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నష్టపరిహారం, పంటల బీమా, వడ్డీలేని రుణాలు, ధాన్యం కొనుగోళ్లు తదితర వాటికి ఈ-క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకుంటారన్నారు. వరినాట్లు పూర్తి చేసిన ప్రతి రైతూ నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకూ అల్లవరం మండలంలోని 1,750 ఎకరాల్లో వరినాట్లు పూర్తి చేయగా, 350 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పూర్తయినట్టు తెలిపారు. అధిక వర్షాల కారణంగా ముంపు బారిన నారుమడుల్లో మంపు నీరు దిగిన వెంటే ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ అందించాలన్నారు. నారుకు కుళ్లు తెగులు సోకకుండా హెక్సాకోనజోల్ మందును పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీ షంషీ, ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, విస్తరణాధికారి శివమోహన్, వ్యవసాయ సహాయకులు రంజిత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఆరుగురికి రెండు రోజుల జైలు, 11 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని మంగళవారం కోర్టు లో హాజరుపర్చగా ఆరుగురిని రెండు రోజుల జైలు, 11 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మరో కోర్టులో...

తాళ్లరేవు మండలం కోరంగి, గొల్లపాలెం, ఇంద్రపాలెం పోలీసు స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించినప్పుడు పట్టుబడిన నిందితులను మంగవారం కోర్టులో హాజరుపర్చారు. వారిలో ఆరుగురికి రెండు రోజుల జైలు శిక్ష, మరో ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలి



శిక్షణలో మాట్లాడుతున్న కృష్ణమోహన్

సామర్లకోట: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో అధికారులు భాగస్వాములు కావాలని రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ అన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ ఉన్న 11 జిల్లాలోని వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఇస్తున్న శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, ఆహార భద్రత, అందరికీ ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, నీరు, పారిశుధ్యం, ఉపాధి వంటి అంశాలను అమలు చేయడం ద్వారా గ్రామీణ సమస్యలను పరిష్కరించి, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అమలుకు అవకాశాలు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిది లక్ష్యాలను నిర్దేశించిందని, వాటిలో మూడు అంశాలపై ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. దీనిలో భాగంగా ప్రస్తుతం సుపరిపాలన కలిగిన గ్రామాలు తయారు చేయడం అనే అంశంపై మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. మూడు రోజుల పాటు నేర్చుకున్న అంశాలపై అధికారులు ఆయా జిల్లాలలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఫ్యాకల్టీలు ఎం.చక్రపాణిరావు, బి.వెంకటేశ్వర్లు, బి.ఆంజనేయులు, కేఆర్ నిహారిక, డీఆర్ఎస్ పద్మజ, వి.ప్రసాద్ తదితరులు శిక్షణ ఇచ్చారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ చోరీ



దొంగలు వదిలేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏఈ నాగేశ్వరరావు

రంగంపేట: మండలంలోని మర్రిపూడి గ్రామానికి చెందిన మోదుకూరి చంద్రతేజ పొలంలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లో సుమారు 10 కిలోల రాగివైరు కట్టలను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున దొంగిలించారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌ను పొలంలో పాడేసి వెళ్లిపోయారు. ఏఈ నాగేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ గ్రామంలో రెండు నెలల్లోనే ఇది నాలుగో చోరీ కావడం గమనార్హం. ఇప్పటికే దొంతమూరు, నల్లమిల్లి, పెదరాయవరం, సుభద్రంపేట, కోటపాడు, వీరంపాలెం గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు గల్లంతై రైతులు ఆందోళన చెందుతున్నారు. కేవలం రాగివైరు ఉండే వాటిపైనే దొంగలు దృష్టి పెడుతున్నారు. ఇటువంటి ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో తిరిగి కొత్తవి ఇవ్వడానికి విద్యుత్తు శాఖ కనీసం ఆరు మాసాల సమయం తీసుకుంటుంది. ఈ కారణంగా రైతులు దాదాపు ఒక పంట కాలాన్ని నష్టపోవాల్సి వస్తోంది. కాగా.. రంగంపేట మండల వ్యాప్తంగా ఎనిమిది నెలల్లో 25 వ్యవసాయ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగిని దొంగలు కాజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం, వాహనంతో విజిలెన్స్ అధికారులు

రావులపాలెం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం పట్టుకుని సీజ్ చేశారు. విజిలెన్స్ ఎస్సై టి.జగన్నాథరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రావులపాలెం జాతీయ రహదారిపై రావులపాడు వంతెన వద్ద ఒక వ్యాన్‌లో తరలిస్తున్న 35.20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. దీని విలువ రూ.1,60,160 ఉంటుందని నిర్ధారించారు. ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామానికి చెందిన వాన్ డ్రైవర్ రొక్కాల సురేష్, వాహన యజమాని ఏ.సత్యనారాయణపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

అన్నవరం ఇన్‌చార్జి ఈఓగా రమేష్‌బాబు



అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా దేవస్థానం డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయ, ధర్మదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత ఈఓ కె.రామచంద్రమోహన్ వ్యక్తిగత కారణాలతో ఈనెల 20వ తేదీ వరకూ సెలవు పెట్టారు. దీంతో రమేష్‌బాబును ఇన్‌చార్జి ఈఓగా నియమించారు. కాగా.. అన్నవరం దేవస్థానంలో సుమారు ఐదేళ్లు అసిస్టెంట్ కమిషనర్ పనిచేసిన రమేష్‌బాబుకు గత ఫిబ్రవరిలో డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ శ్రీకాకుళం జిల్లా అరసవిల్లిలోని సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం ఈఓగా నియమించారు. అక్కడ నుంచి మళ్లీ అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా ఆయన బదిలీ అయ్యారు. ఈమధ్య కాలంలో తలుపులమ్మ లోవ దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు నిర్వహించారు.

పుల్లల లోడు ట్రాక్టర్ బోల్తా



దేవరపల్లి - పల్లంట్ల రోడ్డులో బోల్తా పడిన ట్రాక్టర్

దేవరపల్లి: పుల్లల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దానికి పక్కగా మోటారు సైకిళ్లపై వెళుతున్న ప్రయాణికులు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. పల్లంట్ల వైపు నుంచి దేవరపల్లికి మంగళవారం రాత్రి పుల్లల లోడుతో ట్రాక్టర్ వెళుతోంది. ఉన్నట్టుండి అదుపు తప్పి రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో ట్రాక్టర్ పక్కగా మోటారు సైకిళ్లపై వెళుతున్న ప్రయాణికులు త్రుటిలో ముందుకు వెళ్లిపోయారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. రోడ్డుపై అడ్డుగా ట్రాక్టర్ బోల్తా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వాహనాల రాకపోకలు సుమారు రెండు గంటలు నిలిచిపోయాయి. రాష్ట్ర మానవత కన్వీనర్ బలుసు సత్యనారాయణ జేసీబీని తీసుకువచ్చి ట్రాక్టర్‌ను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

ఐలాండ్ -5 ఘటనలో ఐదుగురిపై చర్యలు

యానాం: గౌతమీ గోదావరి పరిధిలోని ఐలాండ్-5 అభివృద్ధి నిధుల దుర్వినియోగం ఘటనకు సంబంధించి ఐదుగురు అధికారులపై కోర్టు ఆదేశాలతో చర్యలు తీసుకున్నారు. ఈ వివరాలను పుదుచ్చేరి విజిలెన్స్ అండ్ యాంటీకరప్షన్ శాఖ మంగళవారం వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన స్వదేశీ దర్శన్ పథకం నిధులు రూ.5.45 కోట్లతో ఐలాండ్ -5లో పర్యాటక ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని భావించారు. అయితే అనాలోచితంగా అక్కడ నిర్మించిన కట్టడాలు గోదావరి వరదకు కొట్టుకుపోయాయి. పర్యాటక ప్రాజెక్టుకు సంబంధించి జరిగిన అక్రమాలు, శిథిల నిర్మాణాలపై సుంకరస్వామి నాయుడు వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు, సోషల్ యాక్టివిస్టు సుంకర కార్తిక్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. అలాగే ఐలాండ్ -5 ప్రాజెక్టుకు సంబంధించి గత నెల 10న 'కేంద్రం నిధులు గోదారి పాలు' శీర్షికతో 'సాక్షి' పత్రికలో కథనం వచ్చింది. దానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఈ అక్రమాలకు సంబంధించి ఐదుగురు అధికారులపై వేటు వేశారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం



ఢిల్లీలో జరిగిన మహాధర్నాలో పాల్గొన్న డాక్టర్ అనసూరి పద్మలత

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన రూ.48 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి కేవలం 2,400 కోట్లు కేటాయించడం బాధాకరమని, ఇది బీసీ సామాజిక వర్గాలను అవమానించడమేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యాన మంగళవారం న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ పద్మలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు ప్రత్యేక బీసీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేయగా, కేంద్రంలో మాత్రం ప్రత్యేక మంత్రిత్వశాఖ లేకపోవడం దారుణమన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు, మహిళలకు ఉన్న రిజర్వేషన్ ఆధారంగా పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి అసెంబ్లీ, పార్లమెంట్‌లో 15 నుంచి 18 శాతం మాత్రమే రిజర్వేషన్ ఉండటం వల్ల బీసీలకు రాజ్యాధికారంలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. సమగ్ర కులజనగణన, బీసీ బిల్లు మాత్రమే బీసీల ఆర్థిక, రాజకీయ సాధికారతకు సోపానాలుగా నిలుస్తాయన్నారు.